క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోనరావుపేట: మండలంలోని సుద్దాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ దివ్య తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా సుద్దాల, పల్లిమక్త, మంగళ్లపల్లి, రామన్నపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వన మహోత్సవం



సిరిసిల్లటౌన్: పర్యావరణ పరిరక్షణలో మేము సైతం అంటూ.. పట్టణంలోని శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కందాల నవీనకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. కాలనీల్లో మాస్ ప్లాంటేషన్ నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవరకొండ శ్రీనివాస్, ట్రెజరర్ లోకుర్తి తిరుపతి, రాజేశం, జంగిటి రాజు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడ కోర్టు ఆవరణలో మహిళా అడ్వకేట్లు అన్నపూర్ణ, పద్మ, మమత, సరిత ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్జి అజయ్‌కుమార్ జాదవ్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు.

రూసో కళాశాలలో..



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి రూసో కళాశాల చైర్మన్ పి.దేవేందర్‌రావు ఆధ్వర్యంలో కళాశాలలో ఆదివారం మొక్కలు నాటారు. జన్మదినం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం పట్ల అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్, అధ్యాపకులు రాజ్‌కుమార్, సురేశ్, బాలకిషన్, మోహన్, మౌనిక, శ్రీనివాస్, ఆంజనేయప్రసాద్, ఏవోసత్యం, తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వేములవాడరూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు కల్వర్టులు, ఒర్రెలు, కుంటల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రాకపోకలు సాగించే సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అంజయ్య అన్నారు. వేములవాడ రూరల్ ఎస్సై అంజయ్య ముందస్తు చర్యల్లో భాగంగా వాటిని ఆదివారం పరిశీలించారు. జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి వేములవాడకు వచ్చే ఫాజుల్‌నగర్ ప్రాంతంలో వరదనీరు పైనుంచి ప్రవహించి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. వేములవాడ నుంచి హన్మాజిపేటకు వెళ్లే రోడ్డులో మల్లారం వద్ద ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఎప్పటికప్పుడు అక్కడ గ్రామ పంచాయతీ సిబ్బంది తనిఖీలు చేయాలని సూచించారు.

నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలి

తంగళ్లపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం నుంచి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వెంటనే పంపిణీ చేయాలని మండల యాదవ సంఘం అధ్యక్షుడు బండి దేవేందర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏడాదికి రెండుసార్లు పంపిణీ చేయాల్సి ఉన్నా రెండేళ్లుగా పంపిణీ చేయడం లేదని దీంతో గొర్రెలు, మేకలు పెంపకందారులపై భారం పడుతుందన్నారు. ప్రభుత్వం నుంచి ఉచిత మందులు సరఫరా చేయకపోవడంతో ప్రైవేట్ దుకాణాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యేక చొరవ చూపి నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలని కోరారు.

ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు సాయం

గంభీరావుపేట: మండలకేంద్రంలోని బరిగెల గూడెం కాలనీలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ. 4వేల చొప్పున తక్షణ సాయం అందించారు. ఇక్కడ తహసీల్దార్ మారుతిరెడ్డి, కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు హమీద్, రాజుగౌడ్, ప్రభాకర్, గౌరీశంకర్, లక్కం నాంపల్లి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దార్

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మారుతిరెడ్డి సూచించారు. మానేరు వాగు పరీవాహక ప్రాంత రైతులు, గొర్రె కాపరులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

అందని 24 గంటల వైద్యం

- మండలంలో పల్లె దవాఖానాలోనే పీహెచ్‌సీలో వైద్యసేవలు
- సాయంత్రం 4 వరకే రోగులకు వైద్యం
- అత్యవసరమైతే ప్రైవేట్‌కే..



ఇల్లంతకుంట పల్లె దవాఖానాలో కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యసేవలు

ఇల్లంతకుంట: మండలంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు 24 గంటలు వైద్యసేవలు అందడం లేదు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా మార్చనుండగా నాలుగు నెలలక్రితం పీహెచ్‌సీ వైద్యసేవలను పల్లె దవాఖానాలోకి మార్చారు. మండలంలో 35 గ్రామ పంచాయతీలుండగా పల్లె దవాఖానాలోనే పీహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇద్దరు వైద్యులుండగా ఓ వైద్యుడిని చీర్లవంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డిప్యూటేషన్‌పై పంపించారు. ఇల్లంతకుంట పల్లె దవాఖానాలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సేవలందిస్తున్న సిబ్బందిలో వైద్యుడు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్లు మాత్రమే ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్, సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు స్టాఫ్‌నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పల్లె దవాఖానాలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పీహెచ్‌సీ వైద్యసేవలు అందుతున్నాయి. మిగతా అత్యవసర పరిస్థితుల్లో సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట జిల్లాలోని ఆస్పత్రులకు వెళ్తున్నారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మండలంలో 24 గంటల వైద్యసేవలు అందేవి. రోజూ 150 వరకు ఓపీ తీసుకునేవారు. అత్యవసర పరిస్థితుల్లోనూ వైద్యసేవలు అందేవి. డెలివరీ, ఎమర్జెన్సీ కేసులుంటే అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. పల్లె దవాఖానాలో పీహెచ్‌సీ సేవలు కొనసాగిస్తున్నా 24 గంటల వైద్యం ఎందుకు అందించడ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎప్పటిలాగే 24 గంటల వైద్యసేవలు అందించి ఇబ్బందులు లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో 60వేల జనాభా ఉండగా ఒకే డాక్టరు వైద్యసేవలు ఎలా అందిస్తారని, ఒకేవేళసెలవుపై వెళ్తే పరిస్థితి ప్రజలు వాపోతున్నారు. పల్లె దవాఖానాలో పీహెచ్‌సీ వైద్యసేవలు అందించాలని మండలప్రజలు కోరుతున్నారు .

ఏడాదిలోగా 50 పడకల ఆస్పత్రి



ఇల్లంతకుంట మండలకేంద్రంలో నిర్మించే 50 పడకల ఆస్పత్రి భవనం ఏడాదిలో ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. పల్లె దవాఖానాలో పీహెచ్‌సీ సిబ్బంది 24 గంటల వైద్యం అందిస్తే బాగుంటుంది. ఏమైనా ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూస్తాం.

– గుడిసె ఐలయ్య, మాజీ ఎంపీపీ

24 గంటలు వైద్యం అందించాలి



మండల ప్రజలకు 24 గంటల వైద్యం అందించాలి. డిప్యూటేషన్‌పై వెళ్లిన వైద్యుడిని తిరిగి మండలానికి రప్పించాలి. పల్లె దవాఖానాలో ఏడు గంటలు మాత్రమే సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు. మండల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి. ఎప్పటిలాగే ప్రజలకు వైద్యసేవలు అందించాలి.

– పల్లె నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయుడు కనకయ్య, ఉపాధ్యాయులు వెంకటరమణ, వెంకన్న, ప్రభాకర్, సుధాగోని సత్యనారాయణ, వెంకట హనుమాన్, దొడ్ల దేవేందర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న భాస్కర్ గౌడ్

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్లలో కేటీఆర్ సేన నూతన కమిటీని నియమించగా ఆదివారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాట్ల మధు నియామక పత్రాలు అందజేసినట్లు కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్ తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా పొన్నం పృథ్వీని నియమించారు. మండల కమిటీ సభ్యులు తొటు శివకృష్ణ, మామిడాల విజయ్, ఉమాశంకర్, మాజీ ఉపసర్పంచ్ సతీశ్ రెడ్డి, తాజొద్దీన్, సతీశ్, ప్రమోద్ రెడ్డి, సుమన్, శ్రీను, ప్రవీణ్, పవన్, రాకేశ్, నాగరాజు, పర్శరాములు, రాజు, చంద్రమౌళి తదితరలు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నర్సయ్య మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామాల్లో కార్యకర్తలు ప్రజలకు చేర్చాలన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ కింద మాఫీ అయిన రుణాలను వారి ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. జిల్లాలో 13 మండలాలకు ఒక్కో బస్సు చొప్పున అందించేందుకు ప్రణాళిక రూపొందించారన్నారు. రేషన్‌కార్డులు, సన్న బియ్యంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, బుచ్చాగౌడ్, లింగంగౌడ్, గోపాల్, బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న పోలీసులు

చందుర్తి : మూడపల్లి పోచమ్మ శివా రులో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాదారుల డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేని వారి జరిమానాలు విధించారు. ద్విచక్రవాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలన్నారు.

బీజేపీలో చేరిక



బీజేపీలో చేరినవారితో కేంద్రమంత్రి బండి సంజయ్

ఇల్లంతకుంట: మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన పలువురు ఆదివారం కేంద్రమంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. దాదాపు 50మంది వివిధ కుల సంఘాలకు చెందిన వారు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల ఇన్‌చార్జి నాయకుడు ఆడిచర్ల రాజు, కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కష్ణారెడ్డి, చిమ్మనగొట్టు శ్రీనివాస్, సామ బాల్‌రెడ్డి, బత్తిని స్వామి, తిప్పారం శ్రావణ్, బొల్లారం ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్స్ ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు నాయకులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను క్యాంపు కార్యాలయంలో కలిశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించినా తమకు మంజూరుపత్రాలు అందించలేదని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు వివరించారు. తమకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. ఇక్కడ మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, కందికట్కూర్ మాజీ ఎంపీటీసీ కిషోర్‌గౌడ్, తిరుపతి, రంగు రజని, మహేశ్, వెంకటేశ్, కృష్ణ, తదితరులున్నారు.

ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల శివారులో ఆదివారం ఎస్సై మోతిరాం ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు. నంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 11 వాహనాలకు జరిమానా విధించారు.

నివాళి



చందుర్తి: దివంగత మాజీ రాష్ట్రపతి, ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని మండలకేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఇక్కడ మర్రి రాములు, నలుమాచు రవీందర్‌రెడ్డి, రాములు, బత్తుల వంశీ, బత్తుల శ్రావణ్, అక్కనపల్లి రాజేందర్, మర్రి రాములు, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



పొలంలో మనోహర్ మృతదేహం

వీర్నపల్లి: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలోని గర్జనపల్లిలో జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జోగుల మనోహర్(35) కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక, ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరి ఊరు సమీపంలో ఓ పొలంలో మృతిచెంది ఉన్నాడు. పొలం యజమాని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, మృతుడి తల్లి నర్సవ్వకు సైతం మతిస్థిమితం సరిగా లేనట్లు తెలిసింది.

గడప విషయంలో గలాట

బోయినపల్లి: ఆలయానికి గడప పెట్టే విషయంలో ఆదివారం ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా ఎస్సై రాజకుమార్ సముదాయించారు. వివరాలు.. మండలంలోని కొదురుపాక గ్రామంలో నిర్మిస్తున్న ఓ ఆలయానికి కొందరు గడప పెట్టాలని నిర్ణయించారు. దీంతో మరో వర్గం వారు గ్రామస్తులందరి సమక్షంలో గడప పెట్టాలని, ఇప్పుడు అందరికి సమాచారం లేదని గడప పెట్టవద్దని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై సిబ్బందితో ఆలయానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించమని హెచ్చరించారు. అన్ని సామాజిక వర్గాలతో మాట్లాడి అందరి సమక్షంలో కమిటీ వేసుకుని మరోసారి గడప పెట్టుకోవాలని సూచించారు.

ఎస్సైలకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో గోర్ బంజారాల సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో ఎస్సైలుగా పనిచేస్తున్న మాలోత్ మోతిరాం నాయక్, విస్లావత్ శంకర్‌నాయక్, భూక్య రామూర్తినాయక్, గుగులోత్ లక్పతి నాయక్‌ను ఆదివారం గిరిజన నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల ముగ్గురు ఏఎస్సైల నుంచి ఎస్సైలుగా పదోన్నతులు పొందగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన నాయకులు హరిదాస్‌నాయక్, సూర్యనాయక్, శక్కారాం, రవినాయక్, శ్రీనునాయక్, రాజు, భోజ్యా నాయక్, కిరణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో లాంగ్ జంప్ కోసం ఏర్పాటు చేసిన గుంత ప్రమాదకరంగా ఉంది. రెండునెలల క్రితం మైదానంలో లాంగ్ జంప్ కోసం పెద్ద గుంతను తవ్వారు. గుంతలో ఇసుకను నింపలేదు. మూడు రోజులుగా కురుస్తున్న వానలకు అది స్విమ్మింగ్‌పూల్‌గా మారి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి ఇసుకను నింపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : నిమ్మ రాజిరెడ్డి
ఎంఈవో, సెల్ : 9866654974

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



ఎంపీ, సీఎం రమేశ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల అర్బన్ : ఏపీలోని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు కంచర్ల రవిగౌడ్ ఆదివారం సిరిసిల్ల చేనేత విగ్రహం వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌ను విమర్శించే అర్హత మీకు లేదన్నారు. తక్షణమే కేటీఆర్‌కు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు మట్టి శ్రీనివాస్, అనిల్‌గౌడ్, కోడం వెంకటేశం, ఎస్.కె అప్రోచ్, శ్రీనివాస్, హరీశ్, రాము, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై లక్ష్మణ్

వీర్నపల్లి: సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వేముల లక్ష్మణ్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. వాట్సాప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దన్నారు. సైబర్ మోసాలపై 1930లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ల బంగ్లా.. కనుమరుగు



వేములవాడలో రోడ్డు విస్తరణలో కూల్చివేయనున్న భవనం ఇదే..

- పాతతరం సినిమాల నుంచి ఇప్పటివరకు ఇక్కడ సినిమా పోస్టర్లు
- రోడ్ల విస్తరణలో కూల్చివేయనున్న భవనం
- జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటున్న పలువురు

వేములవాడ: వేములవాడ ప్రధాన రహదారిపై 60 ఏళ్ల చరిత్ర కలిగిన ఓ భవనాన్ని ఇప్పుడు రోడ్డు విస్తరణలో కూల్చివేయనున్నారు. ఈ భవనం విశేషమేమిటంటే పాతతరం నుంచి సినిమా పోస్టర్లు వేసేవారు. అప్పట్లో ఏ సినిమా రిలీజ్ అయిందో, ఏ థియేటర్లలో నడుస్తోందో మొదట ఇక్కడే కనిపించేది. అంతేకాదు రాబోయే చిత్రం అంటూ కూడా పోస్టర్లు వేసేవారు. ఇలా మూడు పోస్టర్లు ఉండేవి. సినిమాపై మక్కువ ఉన్న ప్రతీఒక్కరు ఈ భవనాన్ని చుట్టేస్తూ పోస్టర్లను చూసేవారు. వేములవాడలో 60 ఏళ్లుగా సినిమా పోస్టర్లకు కేంద్రంగా నిలిచిన భవనం ఇప్పుడు 80 ఫీట్ల రోడ్ల వెడల్పులో కూల్చివేస్తున్నారు. చరిత్రాత్మక, పోస్టర్ల బంగ్లా ఇక కనుమరుగు కానుంది.

ముందస్తు పోస్టర్లు వేసేవారు



థియేటర్‌లో నడిచే సినిమానే కాదు. రాబోయే సినిమా అంటూ ముందస్తు పోస్టర్లు కూడా బంగ్లాకు వేసేవారు. ఇక్కడికి వచ్చి ఏ థియేటర్‌లో ఏం సినిమా నడుస్తుందో చూసేవాళ్లం. ఆ సమయంలో సినిమా థియేటర్ ఆపరేటర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశా. అప్పటి సినిమాలు చూస్తే ఆనందం.. అనుభూతి కలిగేది.

– చిలుక రమేశ్, వేములవాడ

అప్పటి జ్ఞాపకాలు గుర్తొస్తున్నయ్



ఈ భవనం కేవలం ఇంటి గోడ కాదు. వేములవాడ సినిమా ముచ్చట్లకు పునాదిలాంటిది. ఇది చూస్తుంటే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి. ఈ గోడలపై మా బాల్యం, సినిమా జ్ఞాపకాలు ఇప్పటికీ గుర్తున్నాయి. ఇప్పుడు భవనం కూల్చివేతతో కనుమరుగు కానున్నాయి.

– వాసం భూమేశ్వర్, వేములవాడ

రేపు సినారె జయంతి

వేములవాడరూరల్: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా.సి. నారాయణరెడ్డి జయంతిని ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా సొంత గ్రామంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.